

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి టోకెన్ రహిత సర్వదర్శనానికి 23 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. స్వామివారి సర్వదర్శనానికి సుమారు 12 గంటల సమయం పడుతోంది. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు. శనివారం శ్రీవారిని 81,472 మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి హుండీ ఆదాయం 3.90 కోట్ల రూపాయలు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వెల్లడించారు. శ్రీవారికి 38,820 మంది భక్తులు తలనీలాలు సమర్పించినట్లు అధికారులు వెల్లడించారు.

గుక్కెడు నీటికి కటకట

- రూ.లక్షల ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు సున్నా..
- కేనమాకులపల్లెలో ఇదీ దుస్థితి..


రెండు అడుగుల లోతు గుంతలో నీళ్లు పడుతున్న మహిళ

ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలో ఏ పంచాయతీకి లేనివిధంగా మేజర్ పంచాయతీ అయిన లక్షల్లో ఆదాయం వస్తుంది. ఈ పంచాయతీకి ప్రతిఏటా బడుగుమాకులపల్లి వారపు సంత, పాలారు నదిలో చేపల వేలం, భూరిజిస్ట్రేషన్ రుసుములు, టాక్స్‌లు, ఇతర మార్గాలలో సంవత్సరానికి రూపాయలు 60 లక్షలు నుండి 80 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. అయితే పంచాయతీ పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పనలో పంచాయతీ వారు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. గ్రామపంచాయతీ కేంద్రమైన కెనమాకులపల్లెలో గ్రామస్తులు తాగునీటి కోసం గత నాలుగు సంవత్సరాలుగా అష్టకష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రజల మంచినీటి అవసరాలు తీర్చడానికి కోసం గ్రామంలో 3 రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నాయి. మంచి నీటి బోర్లలో నీరు పుష్కలంగా ఉండి కరెంటు ఉన్నంతసేపు మోటార్లు గుడుగుతూనే ఉంటాయి. గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన పాత తాగునీటి పైప్‌లైన్ -2 మీటర్ల లోతులో పూడుకుపోయింది. గ్రామపంచాయతీ వారు నీటి సరఫరా నిర్వహణను సక్రమంగా చేపట్టకపోవడంతో పాత పైప్‌లైన్ గోతులు తీసి నీటిని పట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పాత పైప్‌లైన్‌లో మీరు సక్రమంగా గంటల తరబడి గుంతల చుట్టూ కూర్చుని గుంతలోని నీటిని తోడుకోవాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గుంతల్లో మురుగు నీరు నిల్వచేరి అపరిశుభ్రంగా తయారైంది. దీంతో ఆ నీటిని తాగి వ్యాధుల భారినపడి అవస్థలు పడుతున్నామని వాపోయారు.

తమ గ్రామంలో కొత్త పైపులైను ఏర్పాటు చేసి ప్రతిఇంటికీ కొళాయి ఏర్పాటుచేసి తాగునీటిని అందించాలని గ్రామపంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతనెలలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్సీ భరత్ దష్టికి తీసుకెళ్లిన తమకు ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ వారు స్పందించి తమ గ్రామంలో నూతన పైపులైను ఏర్పాటు చేసి తాగునీటి కష్టాలను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.


తాగునీటి కోసం వేచి ఉన్న మహిళలు


మురుగు చేరి అపరిశుభ్రంగా మారిన గుంత

పేరుకే కార్పొరేషన్

అభివృద్ధి పనులు అంతంత మాత్రమే....



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు కార్పొరేషన్ నగర జనాభా మూడు లక్షలు. 14 పంచాయతీలను వీలీనం చేస్తూ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. 50 డివిజన్‌లున్న కార్పొరేషన్ ఆశించిన మేరకు అభివృద్ధి పనులకు నోచుకోవడం లేదనే విమర్శలున్నాయి. విభజనకు ముందు జిల్లా కేంద్రంగా పాలనా పరంగా జిల్లాకేంద్రం అయినప్పటికీ అభివృద్ధి మొత్తం తిరుపతి కేంద్రంగా నడిచాయనే విమర్శలున్నాయి. యూనివర్శిలు, పరిశ్రమల ఏర్పాటు పూర్తిగా తిరుపతికే పరిమితమైంది. చిత్తూరులో అపోలో మెడికల్ కళాశాల. రెండు ఇంజనీరిగ్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. జిల్లా విభజన తరువాత చిత్తూరు కార్పొరేషన్ అభవృద్ధి చర్చినీయశంగా మారింది. చిత్తూరు పేరుకే కార్పొరేషన్‌గా ఉందనే విమర్శలున్నాయి. అభివృద్ధి అనేది ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా మారిందని పలువురు నగరవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన మేరకు రోడ్లు విస్తరణ జరక్కపోవడం, కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న భారీ పరిశ్రమలు విజయ సహకార డెయిరీ చిత్తూరు సహకార షుగర్‌ఫ్యాక్టరీ, న్యూట్రిన్ ఫ్యాక్టరీ మూతపడ్డంతో విద్యాభ్యాసం పూర్తి చేసిన నిరుద్యోగులు ఉపాధి కోసం బెంగుళూరు, చెన్నైవైపు పరుగులు తీయాల్సి వస్తోంది.

అభివృద్ధి అంతంతమాత్రమే..

చిత్తూరు కార్పొరేషన్ వేలూరు- తిరుపతి, పలమనేరు- బెంగుళూరు జాతీయర రహదార్లున్నాయి. కట్టమంచి నుండి రెడ్డిగుంట వరకు ఉన్న జాతీయ రహదారి విస్తరణకు గతప్రభుత్వం కొంత ప్రయత్నం చేసినా అడ్డకులతో అగిపోయింది. నగరంలోని ప్రధాన వీధులైన చర్చివీధి, బజారువీధి, గాంధీరోడ్డు, ఎంజిఆర్ వీధి ఇరుకైన రోడ్లు వీటి విస్తరణ కోసం నగర పాలక సంస్థ చర్యలు చేపట్టాల్సి ఉంది. ఏప్పుడో చిత్తూరు మున్సిపాలిటీ ఏర్పడిన నాటి డ్రైనేజీ వ్యవస్థ నేటికి కొనసాగుతోంది. చిన్నపాటి వర్షానికి చర్చివీధి, బజారు వీధి, పొన్నెమ్మ గుడివీధి, ఎంఎస్ఆర్ సర్కిల్, ధర్నా సర్కిల్ ప్రాంతాల్లో రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. నగరవాసులు అండర్ డ్రైనేజీ వ్యవస్థ కళగానే మిగిలింది. గత ప్రభుత్వం చిత్తూరు పాత బస్‌స్టాండ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ.33 కోట్లలో ప్రతిపాదనలు పంపినా కార్యరూపందాల్చలేదు.

పార్కుల పరిస్థితి అధ్వానం...

కార్పొరేషన్ పరిధిలో గంగినేని చెరువు, కట్టమంచి చెరువు, కాజూరు చెరువు ఉన్నాయి. కట్టమంచి, గంగినేని చెరుకుల వద్ద వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. కాజూరు చెరువు సుందరీకరణ పనులు ముందుకు సాగడం లేదు. కట్టమంచి, గంగినేని చెరువుల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. మరోవైపు ప్లాస్టిక్ నిషేదం నగరపాలక సంస్థ పట్టించుకోకపోవడంతో విచ్చవిడిగా ప్లాస్టిక్‌కవర్ల అమ్మకం కొనసాగుతోంది. ప్లాస్టిక్ నిషేదం అమలు చేసి పర్యావరణాన్ని కాపాడాలని పర్యావరణ ప్రేమికులు నెత్తినోరు కొట్టుకుంటున్నారు.

డంపింగ్‌యార్డు.. చెత్తభారం..

మున్సిపాలిటీగా ఉన్న కాలంలో కాణిపాకం రోడ్డు మంగసముద్రం లెనిన్ నగర్ సమీపంలో డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశారు. నగర విస్తరించి డంపింగ్ యార్డు చుట్టుపక్కల అనేక కాలనీలు ఏర్పడాయి. భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, బీడీ కార్మికులు అధికంగా నివాసంఉన్న ఈ ప్రాతం నుండీ డంపింగ్ యార్డును తొలగించాలని ఇక్కడి ప్రజలు 15 ఏండ్లుగా ఫోరాటం సాగిస్తున్నా నగర పాలక సంస్థ అధికారులు కరుణించడం లేదని లెనిన్ నగర్, మంగ సముంద్ర వాసులు వాపోతున్నారు.

టెక్కో ఇండ్లకు మోక్షం ఎప్పుడో...

అపార్టుమెంట్ పేరుతో గత ప్రభుత్వం పూనేపల్లి సమీపంలో 800 మందికి టెక్కో ఇండ్లు మంజూరు చేస్తామని డిపాజిట్ క్రింద రూ. 40 వేల నుండీ 70 వేల వరకు కట్టించుకున్నారు. అత్యంత సుందరంగా అపార్టుమెంట్ నిర్మాణం పూర్తి చేశారు. అపామెంట్లు లబ్దిదార్లకు లాటరీ పద్దతిలో కేటాయింపు జరిగింది. గృహప్రవేశాలకు సిద్ధం అవుతున్న తరుణంలో సాధారణ ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. నాటి నుండీ ఇస్తే అపార్టుమెంట్ ఇవ్వండి లేదా డబ్బులు తిరిగీ ఇవ్వడంటూ లబ్దిదార్లు గగ్గొలు పెడుతున్నారు.

అభివృద్ధిపై దృష్టిపెట్టాలి...

నగర సాధారణ కౌన్సిల్ సమావేశం అభివృద్ధిపై దృష్టిపెట్టి సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందని సిపిఎం నగర కార్యదర్శి సురేంద్ర కోరారు. చిత్తూరు నగరంలో డ్రైనేజీ రోడ్ల విస్తరణ, అంబేద్కర్ భవనం వద్ద రైల్వేఓవర్ బ్రిడ్జి, నీవానదిపై వంతెనల నిర్మాణం, గృహనిర్మాణం వేగవంతం, అర్బన్ హెల్త్‌సెంటర్లు, గ్రంధాలయాల బలోపేతం. న్యూ ప్రశాంత్ నగర్‌లో డ్రైనేజీ కాలువల నిర్మాణంపై కౌన్సిల్ సమావేశం చర్చించి నగర అభివృద్ధి కోసం తీర్మాణాలు చేయాలి. అలాగే చెత్తపన్ను భారం ప్రజలపై మోపడం సరికాదు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న డంపింగ్ యార్డ్ మార్చాలి.

- కాంజివరం సురేంద్రన్, సిఐటియు జిల్లా కార్యదర్శి

గద్దర్ మృతి పీడిత వర్గాలకు తీరని లోటు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రముఖ ప్రజాగాయకుడు గద్దర్ మృతి పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) చిత్తూరు జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. గద్దర్ మృతి పీడిత వర్గాలకు తీరని లోటు అని, ఆయన తనకళలతో ప్రజలను చైతన్య పరచడానికి కృషి చేశారు. అనేక దశాబ్దాలపాటు యువతను ఉర్రూత లూగించారని, జానపద కళారూపాలకు విప్లవ సాహిత్యాన్ని జోడించి ప్రజాసంస్కృతికి పట్టం కట్టారని అన్నారు. సామాజిక మార్పు కోసం తపనపడ్డారు. ఇందు కోసం నిర్బంధాన్ని అనుభవించారని, వారి మృతి అభ్యుదయ, సాహిత్య లోకానికి, ప్రజాఉద్యమాలకు తీరనిలోటు అని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

బంద్ పేరుతో అధికార పార్టీ దౌర్జన్యం

కార్మికులను కొట్టడం దుర్మార్గం : సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లాలో పుంగనూరులో జరిగిన ఘటనను సాకుగా చూపి అధికార పార్టీ నిర్వహించిన బంద్ సందర్భంగా చిత్తూరులో కార్మికుల బస్సుపై దౌర్జన్యం చేసి కార్మికులను విచక్షణ రహితంగా కొట్టడం దుర్మార్గమని ఆ ఘటనను సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరులో జరిగిన దౌర్జన్యంపై సమనయం పాటించాల్సిన అధికార పార్టీ రెచ్చగొట్టే పద్ధతుల్లో వ్యవహరించడంతో పోలీసులు కూడా గాయాలు అయ్యేవిధంగా పరిస్థితిని తీసుకురావడం పూర్తిబాధ్యత అధికారపార్టీ దేనిని తెలిపారు. ఆ సంఘటన చూపి బంద్‌కు పిలుపునిచ్చి చిత్తూరులో వ్యాపారస్తులపైన, కార్మికుల పైన అదే విధంగా కుప్పంలో ఆర్టీసీ బస్సులు ధ్వంసం చేయడం లాంటి ఘటనలు అధికార పార్టీ నాయకులు చేస్తుంటే పోలీసులు చూస్తూ ఊరుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిపక్షపార్టీలు బంద్‌కి పిలుపునిచ్చిన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్న వారిపై అరెస్టులు కేసులు పెడుతున్న పోలీసులు మరి అధికారి పార్టీ వాళ్లు దౌర్జన్యాలు చేసినా ఎందుకు చూస్తూ ఊరుకున్నారని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకటేనని అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అధికారపార్టీ దౌర్జన్యాలను ఇప్పటికైనా అరికట్టి జిల్లాలో శాంతిభద్రతకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

అపోలోకు మారిన వసతులు కరువు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి అపోలో ఆసుపత్రితో ఒప్పందం అయినప్పటికీ అధునాతనమైన వైద్యసేవలు అందుబాటులోకి రాలేదని స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ ప్రతినిధి సత్య మాట్లాడుతూ అపోలో ప్రభుత్వాస్పత్రిలో వైద్యంలో నాణ్యత లోపించిందన్నారు. అన్ని మందులను అపోలో డాక్టర్లు బయట రాస్తున్నారని ఈ కారణం చేత నిరుపేద ప్రజానీకానికి ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్ష మారిందని అన్నారు. అలాగే రుమటాలజీ, ట్రామాకేర్ సౌకర్యం ప్రభుత్వం ఆసుపత్రిలో లేని కారణంగా రోగాలు వ్యాధి నిర్ధారణకు ఇతర జిల్లాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. అలాగే చిత్తూరు రైల్వేస్టేషన్ లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. నగరంలోని కంకరు తేలిన రోడ్లను పునరుద్ధరించి చిత్తూరును అన్నివిధాల అభివద్ధి చేయాలని కోరారు. అదేవిధంగా చిత్తూరు వైపు వెళ్తున్న ప్రధాన రైలు చిత్తూరులో ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సత్య, అశోక్, రమేష్ బాబు, కుమారేషన్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్య

బాబూ దమ్ముంటే నా మీద పోటీ చెయ్

- అవినీతిపై విచారణకు సిద్ధమా..!!
- ఎమ్మెల్యే బియ్యపు సవాల్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చంద్రబాబూ..! నా మీద పోటీకి బొజ్జల సుధీర్‌రెడ్డి చాలరు. దమ్ముంటే మీరు కానీ, మీ కుమారుడు నారా లోకేష్ కానీ శ్రీకాళహస్తికి వచ్చి పోటీ చేయండి. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో నేను అవినీతికి పాల్పడుతున్నానని ఆరోపించారు. అవినీతిపై విచారణకు మీరు సిద్ధమా..? అయితే శ్రీకాళహస్తి రండి. అవినీతి, అభివద్ధిపై విచారణకు నేను సిద్ధంగా ఉన్నా" అని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి సవాల్ విసిరారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగహంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' పేరుతో శ్రీకాళహస్తిలో శనివారం నిర్వహించిన సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మాట్లాడిన మాటలన్నీ అబద్ధాలే అన్నారు. చంద్రబాబునాయుడుకు వయసు మళ్లి ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆయన మాట్లాడే మాటలకు పొంతన ఉండటం లేదని బియ్యపు మధు విమర్శించారు. తాను అక్రమాలకు పాల్పడుతున్నానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. బొజ్జల కుటుంబం లాగా ఎర్రచందనం స్మగ్లింగ్, పేదల భూమి కబ్జా చేయలేదన్నారు. తమది జమీందారీ కుటుంబం అన్నారు. తన తాత రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేశారని ఆయన గుర్తు చేశారు. తాను బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి సంపాదించిన సొమ్మును పేదల కోసం ఖర్చు చేస్తున్నానని ఆయన చెప్పారు. తాను నాలుగేళ్ల ఎమ్మెల్యే అని... చంద్రబాబు నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెబుతున్నారన్నారు. చంద్రగిరిలో రేషన్ డీలరుపై ఓడిపోయిన చరిత్ర చంద్రబాబుది అన్నారు. ఈసారి కుప్పంలో చంద్రబాబుకు ఘోర పరాభవం తప్పదన్నారు. చంద్రబాబును కుప్పంలో జగన్ తప్పకుండా ఓడిస్తారన్నారు. తనకు తక్కువ అనుభవం ఉన్నప్పటికీ ధైర్యం ఉంటే చంద్రబాబు కానీ... నారా లోకేష్ కానీ తనపై పోటీ చేసి గెలవాలన్నారు. బొజ్జల కుటుంబం పూర్తిగా అవినీతిలో కూరుకు పోయిందన్నారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో బొజ్జల బందమ్మ వెండి తీసుకెళ్లినందుకు ఓ అధికారి కుటుంబం ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందన్నారు. బొజ్జల సుధీర్ తన చిన్నాన్న బొజ్జల హరినాథరెడ్డిని చంపేశారని బియ్యపు మధు ఆరోపించారు. బొజ్జల సుధీర్ రెడ్డికి భయపడి హరినాథరెడ్డి కుమారుడు సురేష్ రెడ్డి హైదరాబాదుకు వెళ్లి పోయారన్నారు. ఆయన భయపడకూడదని... తాను అండగా ఉంటానని ఇటీవల ఇతరులతో చెప్పిపంపానన్నారు. ఇలాంటి నీచపు రాజకీయాలు చేసే బొజ్జల సుధీర్ రెడ్డి ఎన్నికల్లో తనపై పోటీకి అర్హుడు కాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో చర్చించి బొజ్జల కుటుంబం చేసిన అక్రమాలు, భూ కబ్జాలపై విచారణ చేయిస్తామన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ ను ఉత్తరకొరియాతో పోల్చడం విడ్డూరంగా ఉందన్నారు. కిమ్ రాజనీతి చంద్రబాబుకు సరిగా సరిపోతుందన్నారు. ఉత్తర కొరియా అధ్యక్షులు కిమ్ లాగా చంద్రబాబు కూడా అతని మామ నందమూరి తారక రామారావుకు వెన్నుపోటు పొడిచారని ఆయన ఆరోపించారు. జగన్ తన సోదరి వైఎస్ షర్మిలకు ఆస్తిలో హక్కు కల్పించలేదని చంద్రబాబు ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు సంపాదించిన ఆస్తిలో ఆయన సోదరుడు నారా రామ్మూర్తి నాయుడుకు ఎందుకు వాటా ఇవ్వలేదన్నారు. నారా రామ్మూర్తి నాయుడుకు స్లో పాయిజన్ ఇచ్చి బయటకు రాకుండా చేశారన్నారు. నారా రోహిత్ సినిమాల్లో అవకాశం లేకుండా లోకేష్ చేస్తున్నారన్నారు. వైఎస్ షర్మిలకు జగన్ ఆస్తిలో ఎంత వాటా ఇచ్చారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. ఇక తాను అక్రమాలకు పాల్పడుతున్నట్లు చంద్రబాబు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. బొజ్జల కుటుంబమే పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడి ప్రజల సొమ్ముతో రూ.వేల కోట్లకు పడగ లెత్తిందన్నారు. ఈ సొమ్ముతో వారు సింగపూర్, మలేషియాలో వ్యాపారాలు చేస్తున్నారని బియ్యపు మధుసూదనరెడ్డి ఆరోపించారు. బొజ్జల సుధీర్ రెడ్డిని ఆయన వీరప్పన్ తో పోల్చారు. తాను శ్రీకాళహస్తిలో ఎంత అభివద్ధి చేశానో చర్చకు సిద్ధమన్నారు. స్వర్ణముఖి సుందరీకరణ, ఏడు రింగు రోడ్లు, హిందూ స్మశాన వాటిక, తొట్టంబేడు మండల రైతులకు తెలుగుగంగ నీరు ఇవన్నీ తన హయాంలో చేసినవే అన్నారు. మహాశివరాత్రికి 16ఏళు ్లగా బంగారు తాళిబొట్లు పంపిణీ చేస్తున్నానని ఆయన చెప్పారు. తన హయాంలో శ్రీకాళహస్తీశ్వర ఆలయం ఎంతో అభివద్ధి చెందిందన్నారు. చంద్రబాబు నిర్లక్ష్యం కారణంగానే రేణిగుంట మండలంలోని బాలాజీ రిజర్వాయరు పనుల్లో జాప్యం చోటు చేసుకుందన్నారు. శ్రీకాళహస్తి ప్రజలకు అన్నీ ఎవరు ఎలాంటి వారో అందరికీ తెలుసనీ, తగిన సమయంలో వారు తగుబుద్ధి చెబుతారన్నారు.

ఎమ్మెల్యే భూమనకు అభినందనల వెల్లువ



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి ఎమ్మెల్యే నూతన టిటిడి చైర్మన్ బాధ్యతలు చేపట్టనున్న భూమన కరుణాకర్‌రెడ్డి ఆదివారం పలువురు ప్రముఖులు కలిసి అభినందనలు తెలియజేశారు. తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కె.రామారావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.బాబు, కోఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ ఖాదిరి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎస్.ఖాదర్ బాషా, ఆర్.శ్రీదేవి, మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి కేఎల్.వర్మ సేతు మాధవ్, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ మోహన్ ఈఈలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి డీఈలు విజయ్ కుమార్‌రెడ్డి, దేవిక, సంజయ్ కుమార్, రవీంద్రారెడ్డి, మహేష్ యాదవ్, గోమతి, కార్పొరేటర్లు టీటీడీ ఉద్యోగులు, వివిధ రంగాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు కరుణాకర్ రెడ్డిని కలిసి సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు.


టీటీడీ నూతన చైర్మన్ కరుణాకర్ రెడ్డికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి డిప్యూటీ సీఎం నారాయణస్వామి అభినందనలు తెలుపుతున్న దృశ్యం

అడిషనల్ ఎస్పీని పరామర్శించిన ఎస్పీ

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: పుంగనూరు అల్లర్ల ఘటనలో గాయపడ్డ ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావును జిల్లా ఎస్పి రిషాంత్‌రెడ్డి ఆదివారం అడిషనల్ ఎస్పీ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ సంఘటన సమయంలో పోలీసులు చూపిన చొరవ పాటించిన సంయమనం ఎంతో గొప్పదని తెలిపారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావుకు సూచించారు.


అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావును పరామర్శిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్

నూతన కమిటీ ఎన్నిక


మధు, అధ్యక్షుడు


గోవిందప్ప, కార్యదర్శి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేంద్రన్, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య సమక్షంలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. అధ్యక్షులుగా మధు, కార్యదర్శి గోవిందప్ప, కోశాధికారి రామకష్ణ, ఉపాధ్యక్షులు మారెమ్మ, రమణ, సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి డి.సుబ్రహ్మణ్యం, నాగరాజు, కాలేషావల్లి, సంపూర్ణమ్మలతోపాటు 16 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న పంచాయతీ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు

మహిళా హింసకు వ్యతిరేకంగా పోరాడుదాం

ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి

ప్రజాశక్తి- పలమనేరు: మహిళపై జరుగుతున్న హింస, పాశవిక దాడులు మద్యం, మాదకద్రవ్యాలను అరికట్టాలని మహిళలకు రక్షణ కల్పించాలని, దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని, దాడులపై అధ్యయన కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ జూలై 28 నుంచి ఆగస్టు 8 వరకు ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం ఆధ్వర్యంలో పోరుజాత జరుగుతున్నదని, ఆగస్టు 8 ఉదయం 11 గంటలకు విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే జాతా ముగింపు సభకు శ్రామిక మహిళలు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మహిళలపై జరుగుతున్న హింస, దాడులు, మద్యం మాదకద్రవ్యాలు సమస్య కేవలం మహిళలకు మాత్రమే సంబంధించింది కాదని ఇది మొత్తం సమాజానికి సంబంధించిన సమస్య. మహిళా సంఘం నిర్వహిస్తున్న పోరుజాతా ముగింపు సభలో మహళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికై

మున్సిపల్ కార్మికుల స్కూటర్ ర్యాలీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న వివిధ కేటగిరీల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర సంఘం పిలుపు మేరకు చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీనీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ సలహాదారులు విసి.గోపీనాథ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఏ.సత్యమూర్తి, గోపినాథ్‌లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పర్మినెంట్ పారిశుద్ధ కార్మికుల సమస్యలతో పాటు ఇంజనీర్ విభాగంలో వివిధ కేటగిరిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వాపోయారు.

సీఐ సేవలు చిరస్మరణీయం



సీఐని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కార్వేటినగరం: సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ సేవలు చిరస్మరణీయమని నగరి డివిజన్ డీఎస్పీ రవికుమార్ అన్నారు. తిరుపతి విజిలెన్స్‌కు బదిలీపై వెళ్లిన సీఐ చంద్రశేఖర్‌కు కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసులు స్నేహ భావంతో మెలిగి ఉత్తమంగా అందించినప్పుడే ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఆ కోవలో విధుల నిర్వహించి అందరి అభిమానాలు చూరగొన్న వ్యక్తి చంద్రశేఖర్ అని అన్నారు. కేసులు చేధించడంలోనూ, సిబ్బందిని అలర్ట్ చేయడంలోనూ, ప్రజా ప్రతినిధులతో కలిసి శాంతి భద్రతలను నెలకొల్పడంలోనూ చంద్రశేఖర్ మించిన వారు లేరని ఆయన సేవలను డీఎస్పీ కొనియాడారు. ప్రతి పోలీస్ అధికారి సీఐ చంద్రశేఖర్‌ను విధి నిర్వహణలో ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్ఐలు షేక్షావలి, దస్తగిరి మాట్లాడుతూ ఉన్నత భావాలు కలిగిన సీఐ చంద్రశేఖర్ వద్ద పని చేయడం మా అదృష్టమని, ఆయన మాకు రోల్‌మోడల్ అని కొనియాడారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, పాత్రికేయులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐ వినోదప్రతాపరెడ్డి, సురేష్ కుమార్, నాగరాజారావు, రాజశేఖర్, ఎస్ఐ గోపి, ఎస్ఐ మునిశక్తి, సర్పంచ్‌లు ధనంజయవర్మ, కుప్పయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాజన్నకు ఘన సన్మానం



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో బీసి రాజన్

ప్రజాశక్తి-గంగవరం: మదర్ థెరిసా విద్యా సంస్థల్లో చదువుతున్న ఇంజినీరింగ్ విభాగంలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో స్వాతంత్ర్య సమరయోధులు, పలమనేరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులైన బీసి రాజన్నను ఆదివారం మేరీమాత మేరీ దేశ్ అన్న కార్యక్రమంలో భాగంగా ఆయనకు ఘన సన్మానం చేసినట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే అన్ని కార్యక్రమాల్లో పాల్గొని తమ తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని, ప్రస్తుత రాజకీయాలు భిన్నంగా ఉన్నాయని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామాలలో అనేక సేవా కార్యక్రమాలు చేయడం గర్వకారణంగా ఉందని భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచనలు ఇచ్చారు. ఛైర్మన్ సునీల్ బాబు, ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, కళాశాల సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీవై పార్టీలో చేరిన మాజీ ఏఎంసీ ఛైర్మన్



మాజీ ఏఎంసీ ఛైర్మన్

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ హరినాథ్ రెడ్డి భారత చైతన్య యువజన పార్టీ తీర్థం పుచ్చుకున్నాడు. ఆదివారం ఎల్ఐసి కాలనీ సునంద నిలయంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ఆయన పార్టీలో చేరారు. హరినాథ్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ రెడ్డప్ప రెడ్డి సోదరుడు కావడం, పార్టీలో చేరడంతో పట్టణంలో ప్రధాన చర్చనీయాంసమైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్సీ రెడ్డప్ప రెడ్డి సోదరునికి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి ఇప్పించడం జరిగింది. ప్రధానంగా పట్టణంలో యువత హరినాథ్ రెడ్డిని ఆదరించే వర్గం ఉన్నది. కొన్ని కారణాల రీత్యా వైసీపీని వదిలి ఈ పార్టీలోకి రావడం జరిగిందని తెలిపారు. వైసీపీలో కూడా మేము ఎప్పుడూ లబ్ధి పొందింది కానీ, మాకు అవసరం కానీ రాలేదని మా శక్తి వంచనతో పార్టీ అభివద్ధికి కషి చేశామని చెప్పారు. అలాంటిది మా తండ్రి రెడ్డివారి ఓబుల్ రెడ్డి సమితీలు ఏర్పడినప్పటి నుంచి చివరి వరకు సమితి ప్రెసిడెంట్ పనిచేసిన ఘనత ఆయనకు ఉన్నదని, అలాంటిది నూతన ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఉన్న విగ్రహాన్ని తీసి బయట ఏర్పాటు చేయడం మాకు బాధాకరమనిపించిందని, ఇప్పటివరకు ఈ విషయంపై నాయకులు ఎవరూ స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు.

గద్దర్ మరణం విప్లవ సాహిత్యానికి తీరనిలోటు

ప్రజాశక్తి-పలమనేరు: ప్రజా యుద్ధనౌకగా పేరుగాంచిన గద్దర్ మరణం విప్లవ సాహిత్యానికి తీరనిలోటని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి తులసి నాథంనాయుడు ఓ ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పాటల ద్వారా ప్రశ్నించే గొంతుక గద్దర్ అన్నారు. తెలుగు జాతి ఉన్నంతవరకు ఆయన పాటలు నిలిచి ఉంటాయన్నారు.

సైకిల్ యాత్రకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలో గత రెండు రోజుల నుండి కుప్పం నియోజకవర్గ తెలుగు యువత సభ్యులు నిర్వహిస్తున్న యువ సైకిల్ యాత్ర శంఖారావం కార్యక్రమానికి గ్రామ, గ్రామాన ప్రజలు, యువత ముఖ్యంగా ముస్లిం మైనార్టీ మహిళలు పెద్ద ఎత్తున జన నీరాజనాలు పలుకుతున్నారు. ఆదివారం పళ్లికుప్పంతో పాటు పలు గ్రామాల్లో సైకిల్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సీఎం చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునుస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, సత్యేంద్ర శేఖర్, త్రిలోక్ పాల్గొన్నారు.

వేపంజేరిలో ముగిసిన సుదర్శన హోమం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో మహా సుదర్శన హోమం పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేలుకొలుపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కె.ఎస్.శ్రీధర్, మేనేజర్ నల్లా వెంకటేష్ రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సామగ్రి అందజేత



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: చిత్తూరుటౌన్‌కి చెందిన ఎం.వి.కేశవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి సహకారంతో రూ.10 వేల విలువైన విద్యుత్ ఇండక్షన్ స్టవ్, స్టీల్ టీ డ్రమ్మును, ఇండియన్ రెడ్ క్రాస్ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి చేతులు మీదుగా పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవికి అందించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ నిర్మల పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల సందర్శన

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల కేంద్రంలోని స్కంధపుష్కరిణి సమీపంలో కుమార గిరిపై వెలసి ఉన్న వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయ అభివృద్ధి పనులను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయ అభివృద్ధి పనులు భేషుగ్గా ఉన్నాయని తెలిపారు. ఆలయ అధ్యక్షుడిగా కేశవ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులు ఎంతో ఆనందాన్ని ఇస్తున్నాయన్నారు. కార్వేట్‌నగరం చారిత్రాత్మక కట్టడాలకు, ఆలయాలకు నిలయమన్నారు. తాను పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడానికి ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించానని, అందుకే కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయ అభివృద్ధికి మ్యాచింగ్ గ్రాంట్ లేకుండా నిధులు మంజూరు చేసి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చి తన రుణాన్ని తీర్చుకున్నానని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టి కనిగిరి కొండ, వరదవెంకటేశ్వరస్వామి ఆలయాలకు, స్కంధపుష్కరిణిలో నీరాలిమండపం, అదే విధంగా వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఉన్న టీటీడీ కళ్యాణ మండపంలో అదనపు గదులు మంజూరు చేయడంలో టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చొరవ ఉందని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎండోమెంట్ ద్వారా గోవర్ధనేశ్వర ఆలయం, అగస్త్యేశ్వరస్వామి ఆలయం, అభిమాని గంగమ్మ ఆలయం వంటి పలు ఆలయాలను యల్లంపల్లి శ్రీనివాసులు చొరవతో పునర్నిర్మాణాలు చేస్తున్నామని, ఎస్సి, ఎస్టీ, బీసీ, గ్రామాల్లో కూడా 75 ఆలయాలను నిర్మాణం చేపట్టడానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ శేఖర్ రాజు, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, డాక్టర్ దీపక్ రెడ్డి, మాజీ ఎఎంసీ ఛైర్మన్ కష్ణయాదవ్, నాలుగు మండలాల మండల కన్వీనర్లు, ఎండోమెంట్ ఈవో క్రిష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి పెద్దిరెడ్డి అబద్ధం చెబుతున్నాడు'



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి-పుంగనూరు: ప్రజాస్వామ్య దేశంలో ఎక్కడైనా తిరిగే స్వేచ్ఛ అందరికీ ఉంటుందని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అయ్యప్ప మాల వేసి అబద్ధాలు చెబుతున్నాడని భారతీయ చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ ఎద్దేవ చేశారు. ఆదివారం ఎల్ఐసి కాలనీ సునంద నిలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని పుంగనూరులోకి రానివ్వకుండా అడ్డుకోవడమే కాకుండా అరాచక శక్తులతో అలజడులు సృష్టించిన పెద్దిరెడ్డి నీతి వాక్యాలు బోధిస్తుంటే ఎవరు నమ్మే పరిస్థితులో లేరన్నారు. ముఖ్యమంత్రి జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కుమారుడు ఎంపీ మిథున్ రెడ్డి, తమ్ముడు పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి అందరూ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అందరి పైన వేధింపులు, దాడులు, హత్యలు జరుగుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చివరి అంకమని ఎన్నికల్లో ఓడితే విదేశాలకు పారిపోతారని ఆరోపించారు. సమావేశంలో చనకంటి సాంబమూర్తి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అరికట్టాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని చిక్కరుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మంచినీళ్ల కుంట నుండి పలువురు అనధికారికంగా జెసిబిల ద్వారా మట్టిని తరలిస్తున్నారని, వారిని అడ్డుకోవాల్సిందిగా పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు విలేఖరులతో మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కుంటనుండి మట్టిని తరలించుకు వెళ్ళిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీళ్ల కుంట వద్దకు వెళ్లి విలేకరులు పరిశీలించగా గ్రామానికి చెందిన జయకుమార్ జెసిబి యంత్రంతో మట్టిని తరలించేందుకు ప్రయత్నిస్తుండగా ప్రశ్నించిన విలేకరులపై నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం, ప్రభుత్వ భూమిలో మట్టిని తీయడం చట్టరీత్యా నేరమని, పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలోని మట్టిని కాపాడాలని గ్రామస్తులు కోరారు.



జెసిబిల ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని బంగారు తిరుత్తని వద్ద ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమల ప్రభుత్వ ప్రాథమిక వైద్య శాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఆదివారం పలువురికి వైద్య సేవలు అందజేశారు. ఏఎన్ఎం గీత మాట్లాడుతూ ఆడికత్తిక బ్రహ్మోత్సవాల వద్ద పుష్ప కావిళ్ళ చెల్లింపు భక్తుల రద్దీ అధికంగా ఉంటుందన్న కారణంతో నాలుగు రోజుల పాటు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడికృత్తిక మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని నరివేపానికొండపై వెలసిన శ్రీ వల్లి సమేత సుబ్రమణ్య స్వామి బంగారు తిరుత్తని కొండ వద్ద ఆడి కత్తిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, కంకణ ధారణ, ఆలయ శుద్ధి, ప్రధాన కలశ స్థాపన, ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలను పండితులు వేదమంత్రాల నడుమ నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ, దీక్ష హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీ వల్లి సమేత దేవసేన సుబ్రమణ్య స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీదేవి, మురళీకష్ణ తెలిపారు.

బంగారుపాళ్యం: సుబ్రహ్మణ్య స్వామికి ప్రీతిప్రదమైన ఆడి నెల పురస్కరించుకొని పలువురు సుబ్రహ్మణ్య స్వామి భక్తులు కావళ్లు చెల్లించేందుకు మొక్కులు చేసుకుంటారని ఆదివారం మండలంలోని మొగిలి వెంకటగిరిలో గ్రామస్తులు ముకుమ్మడిగా సుబ్రహ్మణ్య స్వామి ఉపవాసాలు ఉండి, కావళ్ళు తీసుకొని గ్రామంలో ఊరేగించి అనంతరం సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మొక్కులు చెల్లిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సోమల: ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

ముందస్తు ప్రణాళికతోనే దాడులు



ప్రజాశక్తి-పుంగనూరు: మాజీ సీఎం చంద్రబాబు ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా పుంగనూరు బైపాస్ రోడ్డులో అల్లరి మూకలు సష్టించిన అలజడిలో 62 మంది నిందితులను అరెస్టు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి తెలిపారు. ఆదివారం స్థానిక అర్బన్ సర్కిల్ కార్యాలయంలో ఆమె విలేకరులకు వివరాలను వెల్లడించింది. ఈ సంఘటనకు సంబంధించి నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పిఎ గోవర్ధన్ రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందన్నారు. ఆయన తెలిపిన వివరాలు పుంగనూరులో అలజడులు సష్టించాలని ముందే ప్రణాళికలు వేసుకున్నట్లు చెప్పారు. ఈ నెల రెండో తారీఖున కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి చల్ల బాబు పలు సూచనలు చేశారని తెలిపారు. చంద్రబాబు పర్యటన పుంగనూరు పట్టణంలోకి తీసుకెళ్లాలని కార్యకర్తలను భారీగా తరలించి అక్కడ అల్లర్లు సష్టించి దాడులు చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఈ సమయంలో పోలీసులు లాఠీచార్జ్ చేసిన అందుకు మనమందరం సిద్ధంగా ఉండాలని అందుకు అవసరమైన కర్రలు, రాళ్ళు, బీరు బాటిళ్లు, సోడా బాటిళ్లు సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. దాడి చేస్తే వారు మనపై కాల్పులు జరపవచ్చని ఆ సమయంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మృతి చెందితే పార్టీపై మరింత సానుభూతి పెరుగుతుందని అందుకు సరిపోయే విధంగా ముందస్తు ప్రణాళిక వేసుకున్నారు. అయితే పోలీసులు పట్టణంలోకి రానివ్వకుండా అడ్డుకోవడంతో వారి ముందస్తు ప్రణాళికలు సాగనివ్వకుండా జరగడంతో బైపాస్ రోడ్డు వద్ద అడ్డుకోవడంతో వారు ఈ అలజడులు సృష్టించారని తెలిపారు. పోలీసులపై పలు దఫాలుగా దాడి చేసిన సంఘటనలో 62 మందిని అరెస్టు చేస్తున్నట్లు తెలిపారు. కేసులునమోదు చేసిన తక్కువ సమయంలోనే అందర్నీ అదుపులోకి తీసుకోవడంపై ఎస్పీ రిశాంత్ రెడ్డి కూడా ఇక్కడ సిబ్బందిని ప్రశంసించినట్లు చెప్పారు. పలమనేరు డిఎస్‌పి సుధాకర్ రెడ్డి, ఎస్బి డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, ఇన్చార్జి సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ మోహన్ కుమార్ పాల్గొన్నారు.

జయమ్మ స్ఫూర్తి పురస్కార సభ విజయవంతం

ప్రజాశక్తి-పలమనేరు: అన్నంగుడ్డ తెలుగు సాహిత్యంలో నిలిచిపోయే మంచి కథ అని, "నీరు నేలా మనిషి రాయలసీమ రైతాంగ జీవితాన్ని అద్భుతంగా చిత్రీకరించిన నవల" అని, బహుజన జీవితాన్ని అద్భుతంగా చిత్రీకరించిన రచయిత సుంకోజి దేవేంద్రాచారి అని, మూడు దశాబ్దాల ఆయన సాహిత్య కషిని గుర్తించి గౌరవిస్తూ, ఆయనకు కే.యన్. జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని అందజేస్తున్నట్టు సాహితీవేత్తలు పేర్కొన్నారు. స్థానిక కళామందిరంలో ఆదివారం జరిగిన సాహిత్య కార్యక్రమంలో రచయిత పలమనేరు బాలాజీ తన తల్లి జ్ఞాపకార్థం కే.ఎన్. జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని, రూ.25 వేల నగదు బహుమతిని ప్రముఖ కథా రచయిత సుంకోజి దేవేంద్రాచారికి సాయి గార్డెన్ సిటీ లోని కళామందిరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు ఆర్ ఎం ఉమామహేశ్వర రావు, జి.వెంకటకష్ణ, విఆర్ రాసాని, నాయుని చంద్రశేఖర మూర్తితో కలిసి పలమనేరు బాలాజీ అందజేశారు. తన తల్లి జ్ఞాపకార్థం పలమనేరు బాలాజీ రూ.25 నగదు, పురస్కారాన్ని రచయితలకు ఇవ్వటం రచయితలను ప్రోత్సహించడానికి ఎంతగానో ఉపకరిస్తుందని జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి అన్నారు. తమదైన జీవితాన్ని చిత్రీకరించే రచయితలు అరుదు అని, సరాసరి వాస్తవిక జీవితంలో నుంచి వచ్చిన రచయిత కాబట్టే సుంకోజి దేవేంద్రాచారి వాస్తవికమైన రచనలు చేయగలిగాడని,జీవిత వాస్తవాలను ప్రతిబింబింపజేసే కథా నవలా సాహిత్యాన్ని సష్టించగలిగాడని ఆర్‌యం ఉమామహేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త జి.వెంకటకష్ణ, విఆర్ రాసాని, ప్రముఖ కవి, చిత్తూరు జిల్లా అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) లోసారి సుధాకర్, విజయవాణి సంస్థల అధినేత నాయుని చంద్రశేఖర మూర్తి, జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పాల్గొన్నారు.



రచయిత సుంకోజి దేవేంద్రాచారి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలి




ప్రజాశక్తి-పలమనేరు: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆగస్టు 21, 22వ తేదీలలో జరగనున్న ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర మహాసభలను ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు కేవీ రాఘవులు పిలుపునిచ్చారు. ఆదివారం పలమనేరు తాలూకా ఏపీ ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో పలు శాఖల ఉద్యోగులతో స్థానిక ఎన్జీవో హోం లో ఆ సంఘం అధ్యక్షుడు ఆనంద బాబు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంఘం జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి వి.జి.రఘు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలన్నింటినీ క్రోడీకరించి రాష్ట్ర సమావేశాలలో చర్చించి ప్రభుత్వం వద్ద పరిష్కారానికి గట్టి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలమనేరు తాలూకా అధ్యక్షులు ఆనందబాబు, తాలూకా కార్యదర్శి జయమ్మ, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, సచివాలయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్, సురేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం



ప్రజాశక్తి-పలమనేరు: వీరప్పల్లి పంచాయతీ పరిధిలో అమరనాథ్ రెడ్డి చేసిన అభివద్ధిపై చర్చకు ఆధారాలతో సహా తాను సిద్ధమని వీరప్పల్లి ఎంపీటీసీ సభ్యులు సుబ్రహ్మణ్యం వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం టిడిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. గత నాలుగు రోజులుగా టీడీపీ, వైసీపీ నేతలు ఒకరిపై ఒకరు సవాళ్ళ ప్రతి సవాళ్ల చేసుకుంటున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా శనివారం వైసీపీ నేతలు విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ టిడిపి నాయకులు ప్రసంగించారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి వచ్చిన స్పందనను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు కారుకూతలు కూస్తూన్నారని, సభ్యత సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు ఆర్ బిసి కుట్టీ, గిరిబాబు, నాగరాజు, లోకేష్, సుధాకర్, శ్రీనివాసులు, సుబ్బు, బాబాజాన్, నదీమ్, చెన్నరాయప్ప, సురేంద్ర, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేత్రానందంగా అర్జున తపస్సు



ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని కాసిరాళ్ళ గ్రామంలో వెలసిన ద్రౌపదీ దేవి సమేత ధర్మరాజు స్వామి ఆలయంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం అర్జున తపస్సు ఘట్టం అత్యంత వైభవంగా జరిగింది. చూపరులను ఆకట్టుకునే విధంగా నాటక ఘట్టంను పాండురంగ కళా నాట్య మండలి సభ్యులు నిర్వహించారు. ఈ మేరకు కె.కొత్తూరు గ్రామానికి చెందిన కీశే పత్తిపాటి నారాయణస్వామి నాయుడు కుమారులు పత్తిపాటి కేశవులు నాయుడు, పత్తిపాటి రాజేంద్ర నాయుడుల కుటుంబ సభ్యులు ఉభయదరులుగా పూజా కార్యక్రమం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్తిపాటి భగవతి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పుష్పకావిళ్ల ఊరేగింపు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ అడుసుపల్లి గ్రామంలో ఆదివారం పలువురు గ్రామస్తులు పుష్ప కావిళ్లను గ్రామంలో ఊరేగింపు జరిపారు. తమిళనాడులోని తిరుత్తని ఆలయానికి ప్రతి ఏడాది గ్రామానికి చెందిన పలువురు పుష్ప కావిళ్ళు ఎత్తి మొక్కు చెల్లించడానికి వెళుతూ ఉంటారు. ఇదే క్రమంలో ఆదివారం గ్రామంలో పలువురు పుష్పకావిళ్లను ఊరేగింపుగా గ్రామంలో తిప్పి అనంతరం తమిళనాడుకు బయలుదేరి వెళ్లారు. పలువురు పుష్పకావిల్లు ఎత్తుకున్న వారికి పాద పూజ చేసి కావిళ్ళలో కానుకలను చెల్లించారు.



లక్ష్మమ్మ కుటుంబానికి పరామర్శ



లక్ష్మమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన తుడా ఛైర్మన్

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీ పేట గ్రామానికి చెందిన తుడా అడ్వైజర్ శివాల దామోదర్‌రెడ్డి తల్లి ఎస్.లక్ష్మమ్మ(81) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం మృతి చెందారు. సమాచారం అందుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదివారం ఆర్కేవీబీ పేట గ్రామానికి వెళ్లి ప్రగాడ సానుభూతి తెలిపారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట వెంకటరెడ్డి ఉన్నారు.


దళిత వాడలో పిచ్చికుక్క వీరంగం



దాడిలో గాయపడిన బాలుడు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని దళిత వాడలో ఆదివారం పలువురు గ్రామస్తులను పిచ్చికుక్క కరచి తీవ్ర గాయాల పాలు చేసింది. రెండు రోజులుగా పిచ్చి కుక్క గ్రామంలో తిరుగుతూ చిన్నారులను, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని అదును చూసి వారిని కరిచి పారిపోతూ వచ్చింది. దీంతో కుక్క కరిచిన వారు సోమల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొంది ఇండ్లకు చేరుకున్నారు. పిచ్చికుక్క దాడిలో గాయపడిన వెంకటమ్మ, నిశాంత్(మూడవ తరగతి), వెంకట రత్నయ్య, ఇంకా నలుగురిని పలుచోట్ల కాలుపై, తొడల వద్ద పిచ్చికుక్క కరచడంతో వైద్యం చేయిం చుకున్నారు. ఇదే క్రమం లో అదే దారిలో అడుసుపల్లికి వెళుతున్న మరొక వ్యక్తిని కూడా పిచ్చుకుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, పంచాయతీ అధికారులు గ్రామంలో కుక్కల బెడద లేకుండా చూడాలని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అధ్యాపకుడి అదృశ్యం



వెంటకరమణ (పాతచిత్రం)

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: అధ్యాపకుడు అదృశ్యమైన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని కడపట్లపల్లి గ్రామ నివాసి వెంకటరమణ (30) అదశ్యమైనట్లు అతని భార్య కే కాంచన ఆదివారం పోలీసులను ఆశ్రయించింది. ఈ సందర్భంగా ఆమె తెలిపిన వివరా లు.. స్థానిక మండల కేంద్రంలోని ఆగస్తి జూనియర్ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేస్తున్న నా భర్త రోజులోగే గత నెల 31వ తేదీ కాలేజీకి వెళ్తానని చెప్పి వెళ్ళాడు, సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇంటికి ఏమన్నా వెళ్లి ఉంటారని గత శనివారం వరకు వెతికినా ఆచూకీ తెలియలేదు. మాకు ఒక ఆడబిడ్డ కలదు. డాడీ కావాలని పదేపదే అడుగుతుండటంతో దిక్కుతోచక ఆదివారం బైరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో వెంటనేవారు స్పందించి కేసు నమోదు చేసి త్వరలోనే నీ భర్త ఆచూకీ కనిపెడతామని ఆమెకి భరోసా ఇవ్వడంతో అమె ఇంటికి తిరిగి వెళ్ళినట్లు పోలీసులు తెలిపారు.

సంఘ సేవకులను గుర్తుంచుకోవాలి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సంఘ సేవకులను గుర్తించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మాజీ ఎంపీ చెంగల్రాయ్ నాయుడు పార్కులో 110 వ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సివిల్ జడ్జి కరుణ్ కుమార్ మాట్లాడుతూ చంగల్రాయ్ నాయుడు తనయుడు చిత్తూరు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి సమకూర్చిన విద్యాసామాగ్రిని హాస్టల్లో చదివే విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు 300 మందికి వితరణ చేశారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ సురేంద్ర నాయుడు, కమల్‌నాథ్ రెడ్డి, ధరణి నాయుడు, శ్రీనివాసులు నాయుడు, రవీంద్ర నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.